సాక్షి
గుంటూరు
ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

రేపల్లె రూరల్: ఫోటుమెరక గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఘనంగా దేవస్థానం వార్షికోత్సవం

యడ్లపాడు: బోయపాలెంలో వేంచేసి ఉన్న గ్రామదేవత పోలేరమ్మ పోతురాజు స్వామివార్ల దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది.



వైభవం.. పడిపూజ మహోత్సవం

దాచేపల్లి: అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నారాయణపురం బ్రహ్మనాయుడు ఆడిటోరియంలో అయ్యప్ప మహాపడిపూజ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది.

అ'ద్వితీయ'ం

- రాష్ట్రస్థాయిలో మరోసారి రెండో స్థానంలో నిలిచిన గుంటూరుజిల్లా
- సీనియర్ ఇంటర్‌లో 91 శాతం, జూనియర్ ఇంటర్‌లో 82 శాతం ఉత్తీర్ణత
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీనియర్ ఇంటర్‌లో 76 శాతం, జూనియర్ ఇంటర్‌లో 58 శాతం ఉత్తీర్ణత నమోదు



విజయకేతనం చూపిస్తున్న గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో గుంటూరు జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిన కృష్ణాజిల్లాను ఆనుకుని ఉన్న గుంటూరు జిల్లా ఫలితాల సాధనలోనూ రెండో స్థానంతో కృష్ణా జిల్లా చెంతనే నిలిచింది. శనివారం ఇంటర్మీడియెట్ బోర్డు ప్రకటించిన రెండేళ్ల ఇంటర్ ఫలితాల్లో గుంటూరు జిల్లా రాష్ట్రస్థాయిలో 2వ స్థానంలో నిలిచింది. జూనియర్, సీనియర్ ఇంటర్ పరీక్షలకు హాజరైన 60,844 మంది విద్యార్థుల్లో 52,518 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో అత్యధికంగా 82 శాతం, ద్వితీయ సంవత్సరంలో 91 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండేళ్ల ఫలితాల్లోనూ ఎంపీసీ, బైపీసీ విభాగాల వారీగా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులను కైవసం చేసుకుని సత్తా చాటారు. రాష్ట్రంలోని 26 జిల్లాలస్థాయిలో ఉత్తీర్ణత సాధనలో కృష్ణా, గుంటూరు జిల్లాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఒకేషనల్ ప్రథమ సంవత్సర పరీక్షలకు హాజరైన 1075 మంది విద్యార్థుల్లో 609 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసిన 764 మంది విద్యార్థుల్లో 545 మంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రథమ సంవత్సరంలో 82 శాతం ఉత్తీర్ణత

- గుంటూరు జిల్లాలో ఫస్టియర్ పరీక్షలు రాసిన 32,613 మంది విద్యార్థుల్లో 26,872 మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది 81 శాతంగా ఉన్న ఉత్తీర్ణత ప్రస్తుత ఏడాది ఒక శాతం పెరిగి, 82 శాతంగా నమోదైంది.

ద్వితీయ సంవత్సరంలో 91 శాతం ఉత్తీర్ణత

- గుంటూరు జిల్లాలో సీనియర్ ఇంటర్ పరీక్షలు రాసిన 28,231 మంది విద్యార్థుల్లో 25,646 మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది 87 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ప్రస్తుత ఏడాది అది 91 శాతానికి చేరుకుంది.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత

గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నమోదైన ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే సీనియర్ ఇంటర్‌లో 76 శాతం, జూనియర్ ఇంటర్‌లో 58 శాతంగా నమోదైంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి పరీక్షలు రాసిన 638 మంది ప్రథమ సంవత్సర విద్యార్థుల్లో 368 మంది, 498 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థుల్లో 379 మంది ఉత్తీర్ణులయ్యారు. కళాశాలల వారీగా సీనియర్ ఇంటర్‌లో 91 శాతం ఉత్తీర్ణతతో చేబ్రోలు ప్రథమస్థానంలో నిలువగా, 90 శాతంతో సిరిపురం, 73 శాతంతో గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, 69 శాతంతో పెనుమాక జూనియర్ కళాశాల తరువాతి స్థానాల్లో నిలిచాయి.

రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు

- సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో సత్తెనపల్లి మండలం నార్నెపాడుకు చెందిన నడిపినేని జయశ్రీ 991 మార్కులు కైవసం చేసుకుంది. ఈమె గుంటూరులోని భాష్యం ఐఐటీ-జేఈఈ అకాడమీలో చదివింది. పిడుగురాళ్లకు చెందిన కర్నాటి కావ్యశ్రీ 990 మార్కులు, గుంటూరు అరండల్‌పేటకు చెందిన జె. తారణి 990 మార్కులు సాధించారు.
- సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో గుంటూరులోని భాష్యం మెడెక్స్ కళాశాలలో చదివిన వైఎస్సార్ కడప జిల్లా విద్యార్థిని యాగ నాగ శరణ్య 989 మార్కులు కైవసం చేసుకోగా, గుంటూరుకు చెందిన గాధంశెట్టి హాసిని 989 మార్కులు సాధించింది.
- జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు 466 సాధించిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు ఏ. ప్రమోదలక్ష్మి 436 కైవసం చేసుకోగా, పెద్ద సంఖ్యలో విద్యార్థులు 435 మార్కులు సాధించారు.

కార్డియాలజిస్ట్‌గా ఎదగాలనేది ఆశయం



మా స్వస్థలం కడప. నాన్న వెంగల్‌రెడ్డి వ్యాపారం చేస్తున్నారు. సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో 415 మార్కులు సాధించాం. వైద్య వృత్తిని చేపట్టి, కార్డియాలజిస్టుగా ఎదగాలనే ఆశయంతో ఇంటర్మీడియెట్ నుంచి గుంటూరులోనే చదువుతున్నాం. ప్రస్తుతం నీట్‌కు సన్నద్ధమవుతున్నా.

-యాగ నాగ శరణ్య,
సీనియర్ ఇంటర్ (బైపీసీ, 989 మార్కులు)

తల్లిదండ్రుల బాటలో..



గుంటూరుకు సమీపంలోని గోరంట్లలోని అన్నపూర్ణనగర్ మా స్వస్థలం. నాన్న ఇంద్రప్రసాద్ అమరావతి హాస్పిటల్స్‌లో ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు. అమ్మ స్రవంతి సెయింట్ జోసఫ్ ఆస్పత్రిలో వైద్యురాలు. మా కుటుంబంలో ఎక్కువ మంది డాక్టర్లే. అమ్మానాన్న బాటలో వైద్య వృత్తి చేపట్టేందుకు నీట్‌కు సన్నద్ధమవుతున్నా. కళాశాలలో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నా.

-గాధంశెట్టి హాసిని,
సీనియర్ ఇంటర్ (బైపీసీ, 989 మార్కులు)

అమెరికాలో ఎంఎస్ లక్ష్యం



తెనాలి వివేక విద్యాసంస్థల విద్యార్థిని నేను. తండ్రి పి.హరి ప్రసాద్ హైస్కూలులో లెక్కల టీచరుగా చేస్తున్నారు. తల్లి వాసవి. అమ్మానాన్నల గైడెన్స్‌తో చిన్నతనం నుంచీ చదువుల్లో ఫస్ట్ వస్తున్నా. ఇంటర్ ఫస్టియర్లో ఎంపీసీ గ్రూపులో 467/470 మార్కులను సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. అధ్యాపకుల బోధన, కష్టపడి చదివినందుకు రాష్ట్రస్థాయి ఫలితాన్ని సాధించగలిగాను. ఐఐటీ-జేఈఈ మెయిన్స్‌లో సీటు సాధించాలనీ, తర్వాత అమెరికాలో ఎంఎస్ చేయాలనేది నా లక్ష్యం. అప్పటివరకు ఇష్టంగా చదువుతూ ముందుకెళతాను.

- పి.కృష్ణప్రియ

ఐఐటీలో చదవాలి



మా స్వస్థలం సత్తెనపల్లి మండలం నార్నెపాడు . నాన్న గంగాధర్ వ్యవసాయం చేస్తున్నారు. అమ్మ శిరీష గృహిణి. పదో తరగతి వరకు అక్కడి ప్రైవేటు స్కూల్లో సీబీఎస్‌ఈలో టెన్త్ చదివా. 500 మార్కులకు గానూ 472 వచ్చాయి. జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్‌లో 85.6 పర్సంటైల్ సాధించాం. ఇటీవల జేఈఈ మెయిన్స్ రెండో సెషన్‌కు హాజరై, ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాం. ఐఐటీలో చదవాలనేది నా లక్ష్యం.

- నడిపినేని జయశ్రీ,
సీనియర్ ఇంటర్ (ఎంపీసీ, 991 మార్కులు)

అమ్మ చదివిస్తోంది



మా స్వస్థలం గుంటూరులోని అరండల్‌పేట. నాన్న ఫణీంద్ర కాలం చేయడంతో అమ్మ విష్ణు వందన ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ నన్ను చదివిస్తోంది. టెన్త్‌లో లిటిల్ ఫ్లవర్ స్కూల్లో ఐసీఎస్‌ఈ సిలబస్‌లో చదివి, 557 మార్కులు సాధించాం. జేఈఈ మెయిన్స్ సెషన్-1లో 96 పర్సంటైల్ వచ్చింది. మెయిన్స్-2లో వచ్చే ర్యాంకు ఆధారంగా అడ్వాన్స్‌డ్‌కు సన్నద్ధమై, ఐఐటీలో చదవాలనే లక్ష్యంతో ఉన్నా.

- జె. తారణి,
సీనియర్ ఇంటర్ (ఎంపీసీ, 990 మార్కులు)

నిట్‌లో సీటు సాధన లక్ష్యం



మా స్వస్థలం పిడుగురాళ్ల. నాన్న రమేష్‌బాబు నూనె గానుగ వ్యాపారి, అమ్మ సీతామహాలక్ష్మి గృహిణి. టెన్త్‌లో 577 మార్కులు సాధించా. జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్‌లో 97.67 పర్సంటైల్ సాధించగా, రెండో సెషన్ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నా. నిట్‌లో సీటు సాధించాలనే లక్ష్యంతో ఉన్నా.

- కర్నాటి కావ్యశ్రీ,
సీనియర్ ఇంటర్ (ఎంపీసీ, 990 మార్కులు)

ఐఏఎస్ సాధిస్తా !



మాది తెనాలిలోని బీసీ కాలనీ. స్థానిక వివేక మహిళా జూనియర్ కాలేజీలో చదువుతున్నా. మా నాన్న షేక్ సుభాని కార్పెంటర్. తల్లి జమీలా. ఇద్దరూ వెన్నంటి ఉండి నా చదువుకు ఎంతగానో ప్రోత్సహించారు. ఇక కాలేజీ యాజమాన్యం, అధ్యాపకుల తోడ్పాటు మరువలేనిది. అందుకే రాష్ట్రస్థాయి ఫలితాన్ని సాధించాను. ఐఏఎస్ అధికారిని కావాలని నేను చిన్నతనంనుంచీ కలలు కంటున్నా. ఆ లక్ష్యంతోనే చదువుతున్నా. ఇలాగే కొనసాగిస్తాను.

– షేక్ ఫరీదా, తెనాలి సీనియర్ ఇంటర్
(ఎంపీసీ 989/1000 మార్కులు)

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ

పట్నంబజారు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలువురు నాయకులు పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) మెంబర్లుగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పీఏసీ మెంబర్లుగా రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మాజీ మంత్రి, చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని, మాజీ ఉపసభాపతి, బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త కోన రఘుపతి, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌బాబు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడులను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

విజయకీలాద్రిపై శ్రీలక్ష్మీ హయగ్రీవ హోమం



తాడేపల్లి రూరల్: సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీలక్ష్మీ హయగ్రీవ హోమం నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ పరమహంస పరివ్రాజకులు త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో ఉదయం 9 గంటలకు సకల విద్యాప్రాప్తికి హయగ్రీవ హోమం, అర్చన, ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

నృసింహుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



మంగళగిరి టౌన్ : మంగళగిరిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. చైత్ర పౌర్ణమి సందర్భంగా స్వామిని దర్శించేందుకు బారులుదీరారు. నృసింహుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజ్యలక్ష్మి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. తొలుత ఆలయ ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాదయాత్ర



తెనాలి టౌన్: చైత్ర పౌర్ణమి సందర్భంగా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. స్థానిక నెహ్రూరోడ్డులోని గోవర్ధన స్వామి దేవాలయం వద్ద నుంచి హిందూ బంధువులు శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఐక్యవేదిక సభ్యులు, హిందూ ధార్మికవాదులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



దుగ్గిరాల: పరీక్షల్లో ఫెయిలవ్వడంతో ఇంటర్ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చినపాలెంలో శనివారం జరిగింది. రేవేంద్రపాడులోని హారిక జూనియర్ కాలేజీలో చెన్ను అవినాష్ సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం ఉదయం వెలువడిన ఫలితాల్లో రెండు సబ్జెక్ట్‌ల్లో ఫెయిల్ అయినట్టు తెలిగానే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలి పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు కొడుకు ఉరి వేసుకోవడాన్ని గమనించి భోరున విలపించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

హంస వాహనంపై నృసింహస్వామి

మంగళగిరి టౌన్: చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి శనివారం హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటలకు గ్రామోత్సం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హంస వాహనంపై స్వామి వారిని దర్శించుకుని భక్తిపారవశ్యం పొందారు. హంస వాహనంపై స్వామి ఆలయం చుట్టూ విహరించారు. చైత్ర పౌర్ణమి నాడు హంస వాహనంపై స్వామి దర్శనం చేయడం భక్తులకు పవిత్ర అనుభవమని అర్చకులు తెలియజేశారు. ఉత్సవ కైంకర్య పరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన వేదాంతం వెంకట రమణాచార్యులు కుమారులు వ్యవహరించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ కార్య నిర్వహణాధికారి పర్యవేక్షించారు.



గ్రామోత్సవంలో నృసింహుడు

ఎండిన మొక్కలు.. తేలని లెక్కలు



పార్కులో ఎండిపోయిన మొక్కలు

- రూ.30 లక్షలు హుష్ కాకి !
- నగరపాలక సంస్థ పరిధిలో నాటామంటూ అధికారులు వెల్లడి
- ఎక్కడా కనిపించని పరిస్థితి
- ఇటీవల కొరిటపాడు పార్కులో ఎండిపోయిన మొక్కలు
- సోషల్ మీడియాలో వైరల్
- పార్క్ ఏడీహెచ్ శ్రీనివాస్‌ను సరెండర్ చేసిన కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో లక్షలాది రూపాయలు వెచ్చించి కొన్న మొక్కలు మాయమై పోయాయి. ఈ ఏడాదిలో జనవరి 10న గుంటూరులో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చారు. ఆయన పర్యటించే ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి చేబ్రోలు హనుమయ్య కంపెనీ వరకు రోడ్లు అందంగా కనిపించేందుకు ప్రత్యేక మొక్కలు(షో మొక్కలు) తూర్పుగోదావరి జిల్లా కడియం నుంచి రూ. 30లక్షలు వెచ్చించి తెప్పించారు. అయితే, ఎన్ని తెప్పించారో.. ఎన్ని ఉన్నాయో నగరపాలక సంస్థ అధికారుల వద్ద ఎటువంటి లెక్కా లేదు.

ఆవులు, బర్రెలు తినేశాయి?

సీఎం చంద్రబాబు పర్యటన కోసం తెచ్చిన మొక్కలను వివిధ పార్కుల్లో పెట్టారు. అయితే, వాటి పర్యవేక్షణకు చర్యలు తీసుకోకపోవడంతో చాలా వరకు ఎండిపోయాయి. కొద్ది రోజుల కిందట కొరిటపాడు వాకింగ్ ట్రాక్‌లో మొక్కలు పాడైపోయాయని సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో నగరపాలక సంస్థ అధికారులు దీనిపై విచారణ చేపట్టారు. అయితే, మొక్కలు తెప్పించిన ఏడీహెచ్ శ్రీనివాస్ ఆవులు, బర్రెలు తినేశాయని చెప్పినట్లు సమాచారం. దీంతో ఆయన అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఏడీహెచ్ శ్రీనివాస్ సరెండర్?

మొక్కల నిర్వహణలో ఆలసత్వం వహించిన ఏడీహెచ్ శ్రీనివాస్‌ను మాతృశాఖకు సరెండర్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పార్కుల నిర్వహణకు ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించారు. మొక్కల బిల్లు కూడా ఇంజినీరింగ్ అధికారులు ప్రాసెస్ చేయలేదు.వివరాలు లేకపోవడంతో పెండింగ్‌లో పెట్టారు.

నామినేషన్ పద్ధతిలో తెప్పించడంపై ఎస్‌ఈ గుర్రు

సీఎం పర్యటన గుంటూరులో ఉన్న నేపథ్యంలో రోడ్లు అందంగా ఉండేందుకు ప్రత్యేకంగా మొక్కలు తెప్పించాలని కమిషనర్ ఏడీహెచ్‌ను ఆదేశించారు. దీంతో హడావుడిగా రెండు రోజుల ముందు నామినేషన్ పద్ధతిలో కడియం నుంచి తెప్పించారు. మొక్కలు తెప్పించే ప్రక్రియను కాంట్రాక్టర్ అప్పగించి ఉంటే బాగుండేదని అప్పుడే ఎస్‌ఈ నాగమల్లేశ్వరావు ఈ ప్రక్రియను వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. నామినేషన్ పద్ధతిలో మొక్కలు తెప్పించినందుకే ఆయన బిల్లు ప్రాసెస్ చేయడం లేదని నగరపాలక సంస్థ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీనిపై నాగమల్లేశ్వరరావును వివరణ కోరగా మొక్కలకు సంబంధించిన బిల్లు పెండింగ్‌లో ఉందని తెలియజేశారు.

చెయ్యి దాటుతున్న ఖర్చు

గుంటూరు నగరానికి చెందిన సాయి భరద్వాజ్ ఒక ప్రైవేట్ కంపెనీలో మెడికల్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. జీతం నెలకు రూ.60వేలు. ఈ మొత్తంతో ఇంట్లోని నలుగురు కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవిస్తున్నాడు. అయితే, ఇటీవల ఒక దుకాణంలో వస్తువులు కొని బిల్లు పే చేసేందుకు స్కానర్ క్లిక్ చేసి డబ్బులు కొడితే.. సరైన బ్యాలెన్స్ లేదని చూపించింది. దీంతో ఒక్కసారిగా పరిస్థితి అర్థం కాలేదు. ఆ తర్వాత చెక్ చేసుకుంటే డిజిటల్ పేమెంట్స్ ద్వారా తానే ఖర్చు చేసినట్లు నిర్ధారించుకున్నాడు.

- డిజిటల్ చెల్లింపులు.. జేబుకు చిల్లులు !
- పెరిగిన అనవసర ఖర్చులు
- ధర తెలుసుకోవడం దాదాపుగా మానేశారు
- రూ.5 మొదలు వేల రూపాయల లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే
- తల్లకిందులవుతున్న ఫ్యామిలీ బడ్జెట్
- కోవిడ్ తర్వాత అన్నీ డిజిటల్ చెల్లింపులే..
- చిల్లర కొరత నేపథ్యంలోనూ మారిన తీరు



పట్నంబజారు: జిల్లాలో డిజిటల్ పేమెంట్స్ పెరిగాయి. ఒకప్పుడు ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం లాంటివి ఉపయోగించాలంటే జనం భయపడేవారు. ఇప్పుడు అవలీలగా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఎంతగా అంటే రూ.5 నుంచి వేల రూపాయల వరకు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తున్నారు. ఎంత ఖర్చు పెడుతున్నారో తెలియనంతగా వీటి వినియోగం మారిపోయింది. అయితే, పెట్టే ఖర్చు మొత్తం బ్యాంకు ఖాతా ద్వారానే జరుగుతోంది. అది చిన్న మొత్తమైనా, పెద్ద మొత్తమైనా సరే అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో పేమెంట్స్ ద్వారా మనకు తెలియకుండానే బ్యాంకులు ప్రభుత్వానికి చెప్పేస్తున్నాయన్న మాట.

లెక్కలేకుండా ఖర్చు

ఆన్‌లైన్ లావాదేవీల కారణంగా బ్యాంకు ఖాతా ఖాళీ అయ్యేవరకు ఎంత ఖర్చు పెట్టామో తెలియని పరిస్థితి. దీనికితోడు ఏ వస్తువును ఎంతకు కొనుగోలు చేస్తున్నారో కూడా తెలియకుండా, బేరమాడకుండా కొనేస్తున్నారు. గతంలో మనం కిరాణా దుకాణానికి వెళ్తే సరుకులకు బిల్లు వేస్తే ఏదీ ఎంత అయిందని చూసుకుని చేతి ద్వారా డబ్బులు చెల్లించే వాళ్లం. కానీ డిజిటల్ పేమెంట్స్ కారణంగా ఇవేమీ పట్టించుకోవడం లేదు. షాపువారు ఎంత చెబితే అంత చెల్లించి వచ్చేస్తున్నారు. డిజిటల్ పేమెంట్స్ కారణంగా డబ్బు ఎలా వస్తుందో.. ఎలా పోతుందో కూడా తెలుసుకోలేకపోతున్నారు.

కోవిడ్ తర్వాత ఊపందుకున్న పేమెంట్స్

డిజిటల్ పేమెంట్స్ రూపంలో పదేళ్ల కిందట డెబిట్, క్రెడిట్ కార్డులు, గిఫ్ట్ కార్డులు వచ్చాయి. కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసి వాటిని వ్యాపార దుకాణాల్లో స్వైప్ చేసి డబ్బులు చెల్లించేవారు. కొంత కాలం తర్వాత ఇవే కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లోనే వస్తువులను కొనుగోలు చేసే అవకాశం వచ్చింది. కోవిడ్ అనంతరం వ్యాపార లావాదేవీల్లో మరింత సరళతరం వచ్చింది. ఫోన్‌పే, గూగుల్‌పే వంటి యాప్‌ల ద్వారా జనం డబ్బు చెల్లించడం, తీసుకోవడం ప్రారంభించారు. వ్యాపారులు సైతం క్రమంగా అంగీకరించక తప్పని పరిస్థితి. చిల్లర కొరత కారణంగా కూడా డిజిటల్ పేమెంట్స్ ఊపందుకున్నాయి.

చిల్లర కొరత తీరింది



మాది చిన్న బడ్డీకొట్టు. రూ.10 నుంచి రూ. వెయ్యి వరకు వరకు వివిధ రకాల వస్తువులు విక్రయిస్తాం. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రతిరోజూ ఎంతో మంది వస్తుంటారు. ఈ క్రమంలో చిల్లర కొరత బాగా ఎదురయ్యేది. డిజిటల్ పేమెంట్స్‌తో సమస్య తీరింది.

– పి. శివయ్య, వ్యాపారి, గుంటూరు

తెలియకుండానే ఖర్చు



గతంలో నగదు రూపంలో డబ్బులు ఉండటం వల్ల దేనికెంత ఖర్చు చేస్తున్నామో తెలిసేది. కానీ ఇప్పుడంతా డిజిటల్ పేమెంట్స్ కావడంతో ఎంత ఖర్చు చేస్తున్నామో అర్థంకాని పరిస్థితి. తెలియకుండానే నెలలో 20 నుంచి 30 శాతం ఎక్కువ ఖర్చు పెడుతున్నారు.

-రామరాజు కోటేశ్వరరావు
(స్టాక్ బ్రోకర్, పీఎల్ క్యాపిటల్)

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు దహనం

- నిరసన తెలుపుతూ ర్యాలీ నిర్వహించిన సీపీఐ
- పాల్గొన్న జాతీయ కార్యదర్శి కె.నారాయణ



ర్యాలీలో పాల్గొన్న నారాయణ, మస్తాన్‌వలి, నాయకులు

లక్ష్మీపురం: ఎన్డీఏ ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గుంటూరులో శనివారం కొత్తపేట కార్యాలయం నుంచి మాయాబజార్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముందుగా వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణ బిల్లును నాయకులు దహనం చేశారు. ముస్లిం సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు బిల్లు ముస్లింల సమస్య కాదని, అన్ని వర్గాల ఆస్తులను దోచుకొని బడా కార్పొరేట్లకు దోచిపెట్టే చర్యని విమర్శించారు. రాజ్యాంగానికి ప్రమాదం వాటిల్లిందని, తమ పార్టీ సుప్రీం కోర్టును కూడా ఆశ్రయించిందని తెలిపారు. ఈ దేశం ఒక కులానికో, మతానికో సంబంధించింది కాదని పేర్కొన్నారు. రాజ్యాంగ ఆదేశ సూత్రాలను మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకొచ్చి ముస్లింలలో భయాందోళన సృష్టిస్తోందని ధ్వజమెత్తారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ గుజరాత్ పెట్టుబడిదారులకు భారతదేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్ని కేంద్ర ప్రభుత్వం తాకట్టు పెడుతోందని విమర్శించారు. భవిష్యత్తులో క్రైస్తవులు, హిందువుల ఆస్తుల్ని దోచుకునే యత్నంలో భాగంగానే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తెచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ వలి, మేడా హనుమంతరావు, ఇప్టా జాతీయ కార్యదర్శి షేక్ గని, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, ముస్లిం లీగ్ పార్టీ నాయకులు బషీర్ అహ్మద్ పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 7,000 గరిష్ఠం : రూ. 9,500

మోడల్ ధర రూ. 8,000

క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి దివ్య రథోత్సవం



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వైభవంగా కల్యాణం నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిని గరుడ వాహనంపై అధిష్టింపజేసి పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం దివ్య రథోత్సవం కొనసాగింది. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి దర్శించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లను ఈఓ ఎస్.ఆంజనేయాచార్యులు పర్యవేక్షించారు.

నాగిరెడ్డికి ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు

కారంచేడు: మండలంలోని యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన మదర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు మున్నంగి నాగిరెడ్డి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు అందుకున్నారు. చిత్తూరు విజయం టెక్నాలజీస్ కళాశాల ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మదర్ సేవా సొసైటీ అనేక ప్రాంతాలలో అందించిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు అందించినట్లు నాగిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సోమల్‌రాజు ఫౌండేషన్ అధ్యక్షులు శివరాజు, ఎంఈఓలు పి. రాజేంద్రప్రసాద్, ఎన్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ నాటక కళా పరిషత్ పోటీలు ప్రారంభం

- జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీలు
- జ్యోతి ప్రజ్వలన చేసిన ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్
- పెసర్లంక రమణకు వైఎస్సార్ స్మారక పురస్కారం ప్రదానం



రమణకు వైఎస్సార్ స్మారక పురస్కారం అందిస్తున్న దేవినేని అవినాష్, అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: పట్టణానికి చెందిన డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్ జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీలు శనివారం రాత్రి ఘనంగా ఆరంభమయ్యాయి. స్థానిక రామలింగేశ్వరపేటలోని మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రారంభ సభకు పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి దేవినేని అవినాష్ మాట్లాడుతూ తన తండ్రి దేవినేని రాజశేఖర్ (నెహ్రూ)తో సన్నిహితంగా ఉంటూ, తాను పార్టీలో చేరిన దగ్గర నుంచి అండగా ఉంటున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్ నేతృత్వంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్ జాతీయస్థాయి నాటికల పోటీల నిర్వహణను అభినందించారు. తెనాలి వెలుపల మహనీయుల విగ్రహాలను చూశానని తెలిపారు. కళ, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో తెనాలి వైభవాన్ని స్ఫురణకు తెచ్చేలా నాటి ప్రముఖుల విగ్రహాలను ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. సోషల్ మీడియా, ఓటీటీల ట్రెండింగ్‌లో కళలకు ప్రాధాన్యత తగ్గిందన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వివిధ రంగాల ప్రముఖులకు డాక్టర్ వైఎస్ పేరిట అవార్డులను ఇచ్చి గౌరవించినట్టు గుర్తుచేశారు. సభాధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ కళల తెనాలి వారసుడిగా తాను నాటక కళను ప్రోత్సహిస్తానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమ ప్రదాత డాక్టర్ రాజశేఖరరెడ్డి, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్‌ను రాజకీయ పార్టీల దృష్టితో చూడటం సమంజసం కాదని, వారి పేరుతో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను ఆదరించాలని సూచించారు. పట్టణ రజక సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువనేత పెసర్లంక రమణను ఇదే వేదికపై డాక్టర్ వైఎస్ స్మారక పురస్కారంతో సత్కరించారు. కొల్లిపర శ్రీ కళా నిలయం కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి, వంగా లక్ష్మారెడ్డి, కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్, సిరికృష్ణ మాట్లాడారు. ప్రత్యేక అతిథిగా అన్నాబత్తుని సత్యనారాయణ హాజరయ్యారు. తొలుత నృత్య గురువు వసంతదుర్గ శిష్య బృందం కూచిపూడి, జానపద నృత్యాలను ప్రదర్శించారు. తెనాలి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని నిర్వాహకులు ఆరాధ్యుల కన్నా, అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, పిట్టు వెంకట కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

నీరసించిపోతున్న నిమ్మ రైతులు

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి



రైతులతో శివసాంబిరెడ్డి

తెనాలి: ప్రకృతితో పాటు మార్కెట్ మాయాజాలంతో నిమ్మ రైతులు నీరసించిపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం నిమ్మతోటలు సాగుచేస్తున్న రైతులు, కౌలు రైతులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నవంబరు, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో మంచు కారణంగా చెట్లకు పూత, కాయ రాలిపోయి దిగుబడి తగ్గిందని పలువురు రైతులు వెల్లడించారు. ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షలతో కౌలుకు తీసుకున్నామని రైతులు చెప్పారు. మార్కెట్లో రెండు రోజులు ధర బాగుంటే అయిదురోజులు ధరలు తగ్గిపోతున్నాయని మరికొందరు తెలిపారు. నిమ్మకాయల యార్డులో 10 శాతం కమీషన్, ధర్మం వగైరాలను అరికట్టాల్సిన ఆవశ్యకతను తమ దృష్టికి తీసుకొచ్చినట్టు సాంబిరెడ్డి తెలిపారు. నిమ్మ రైతులు నీరసించిపోకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



పర్చూరు(చినగంజాం): బాపట్ల జిల్లా ఉప్పుటూరులో రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలోని వెంకటేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి వార్ల తిరునాళ్లను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి పోలురాధ ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. క్వింటాన్నర ఇసుక బస్తాలతో కూడిన చక్రాలు తిరగని ఎడ్ల బండిని పది నిమిషాల్లో ఎక్కువ దూరం లాగిన జతను విజేతగా ప్రకటిస్తామని పేర్కొన్నారు. పందాల్లో గెలిచిన ఎడ్ల జతలకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు బహుమతులుంటాయని వివరించారు. పోటీలలో రెండవ రోజు జూనియర్స్ విభాగంలో 18 ఎడ్ల జతలు పాల్గొన్నట్లు వారు తెలిపారు.

సారా జోలికి వస్తే జిల్లా బహిష్కరణ



బాపట్ల టౌన్: నాటుసారా తయారు చేసినా..విక్రయించినా అలాంటి వ్యక్తులపై పీడీ యాక్ట్ కేసులు నమోదుచేసి వారిని జిల్లా బహిష్కరణ చేస్తామని ప్రకాశం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ హెచ్చరించారు. శనివారం మండలంలోని వెదుళ్లపల్లి, బేతపూడి గ్రామాల్లో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. కె.విజయ మాట్లాడుతూ పదేపదే నాటుసారా తయారుచేస్తూ పట్టుబడిన వారిని ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా బహిష్కరణ చేసేందుకు కూడా వెనుకాడేది లేదన్నారు. నాటుసారా తయారీకి ముడి సరుకు సరఫరా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రకాశం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎ.జనార్దనరావు, బాపట్ల ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, బాపట్ల ఎక్సైజ్ సీఐ పి.గీతిక, ఎస్‌ఐలు ప్రభుదాస్, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఆణిముత్యాలు

ఇంటర్మీడియెట్ బోర్డు శనివారం ప్రకటించిన రెండేళ్ల ఇంటర్ ఫలితాల్లో గుంటూరు జిల్లా విద్యార్థులు మెరిశారు. రాష్ట్రస్థాయిలో 2వ స్థానంలో నిలిచారు. ప్రథమ సంవత్సరంలో అత్యధికంగా 82 శాతం, ద్వితీయ సంవత్సరంలో 91 శాతం ఉత్తీర్ణత నమోదైంది. –గుంటూరు ఎడ్యుకేషన్

సాంకేతిక నిపుణురాలిగా ఎదుగుతా !



మా స్వస్థలం నరసరావుపేట. నాన్న వెంకట్రావు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసేవారు. అమ్మ చిలకమ్మ గృహిణి. టెన్త్‌లో 566 మార్కులు సాధించా. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్‌గా ఎదగాలనే లక్ష్యంతో గుంటూరులోని శ్రీచైతన్య కళాశాల నుంచి జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్‌కు హాజరై, 82 పర్సంటైల్ సాధించాను. మెయిన్స్ రెండో సెషన్ ఫలితాల కోసం వేచి ఉన్నా. ప్రముఖ విశ్వ విద్యాలయంలో సీటు సాధించి ఇంజినీరింగ్‌లో చేరతాను. –టి. శరణ్య, సీనియర్ ఇంటర్ (ఎంపీసీ 991 మార్కులు)

మంచి వర్సిటీలో సీటు లక్ష్యం



మా స్వస్థలం చిలకలూరిపేట. నాన్న వ్యాపారం చేస్తున్నారు. అమ్మ సావిత్రి గృహిణి. గుంటూరులోని శ్రీచైతన్య కళాశాలలో చదివి, జేఈఈ మెయిన్స్‌లో 76 పర్సంటైల్ సాధించాను. రెండో సెషన్ ఫలితాలు విడుదలైన తరువాత ర్యాంకు ఆధారంగా ఏపీలోని పేరెన్నికగన్న వర్సిటీలో సీటు సాధిస్తాను. –రావి చంద్రశేఖర్, సీనియర్ ఇంటర్ (ఎంపీసీ 990 మార్కులు)

సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపిస్తా !



నా స్వస్థలం కొల్లూరు మండలం పోతార్లంక. తల్లిదండ్రులు మురళీకృష్ణ, కాశీ అన్నపూర్ణలు. నాన్న అర్చకత్వం చేస్తారు. అమ్మ గృహిణి. ఇంటర్ ఫలితాల్లో 992 మార్కులు సాధించా. బీటెక్‌లో సీఎస్ఈలో సైబర్ సెక్యూరిటీ తీసుకుంటాను. జేఈఈ మెయిన్స్‌లో 93.4 పర్సంటైల్స్ సాధించగా ఈఏపీసెట్‌లో 5వేలలోపు ర్యాంక్ తెచ్చుకోవటానికి కృషి చేస్తున్నా. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించి ఎక్కువ మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం నా లక్ష్యం. – వి. కౌశిక్, విజ్ఞాన్ జూనియర్ కళాశాల, వడ్లమూడి

ఇంటర్‌లో బాలికలదే హవా

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల సాధనలో బాలికలు సత్తా చాటారు. గుంటూరు జిల్లాలో ఫస్టియర్ జనరల్ విభాగంలో 17,433 మంది బాలురు పరీక్షలు రాయగా, వారిలో ఉత్తీర్ణులైన 13,980 మందితో 80 శాతం నమోదైంది. సీనియర్ ఇంటర్ పరీక్షలు రాసిన 15,095 మంది విద్యార్థుల్లో 13,478 మంది ఉత్తీర్ణులై, 89 శాతం నమోదైంది. ఫస్టియర్ పరీక్షలు రాసిన 15,180 మంది బాలికల్లో 12,892 మంది ఉత్తీర్ణులై, 85 శాతంగా నమోదైంది. సెకండియర్ పరీక్షలు రాసిన 13,136 మంది విద్యార్థినుల్లో 12,168 మంది ఉత్తీర్ణులై, 93 శాతం నమోదైంది.

ఇంటర్ ఫలితాల్లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ



అత్యధిక మార్కులు సాధించిన కౌశిక్‌ను అభినందిస్తున్న శ్రీకూర్మనాథ్ తదితరులు

చేబ్రోలు: ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనన మాట్లాడారు. శనివారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన రెండో సంవత్సరం విద్యార్థులు వి.కౌశిక్ (992), ఎం.అఖిలేష్ (989), జి.నాగేంద్ర గుప్త (989), ఎస్.నాగ మోక్షజ్ఞ(989), బి.షాన్ బాషా (988), ఎస్.మోహన్ నాగ కార్తిక్ (988), సీహెచ్. చరణ్ కుమార్ (987), వై.పార్థసారథి (987), కె.భానుప్రకాష్‌రెడ్డి (987), కె.యశస్వి (987), ఎం.కవిత (987), పి.కంచన్ కుమారి (987), టి.జాహ్నవి (987) మార్కులు సాధించారని వివరించారు. మొదటి సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు ఎస్‌డీ మహమ్మద్ అష్రఫ్ (465), టీడీఎస్ఎస్‌పీ లక్ష్మణ్ నారాయణ (465), పి.పూజిత (465) జి.యశ్వంత్ (464), కె.తేజ ప్రకాష్ (464), పీ.సమీర్ (464), ఎం.సత్య (464), డి.తరుణ్ రాజు (464), ఎస్.వంశీ క్రిష్ణా రెడ్డి (464), డి.రామ్ చరణ్ (464), ఎం.హరీష్ (464), ఐ.భాను త్రివేద్ (464), ఎస్‌కే ఫయాజ్ అహ్మద్ (464), పి.సుషాంత్ (464), ఎం.వి.అమృత వర్షిణి (464), ఓ.సుప్రియ (464), పి.వర్షిణి (464), ఆర్.మహేశ్వరి (464), వి.నిక్షిత (464), కాటూరి అక్షయ (464), ఆర్.లక్ష్మి చరిత (464) మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ లావు రత్తయ్య తదితరులు అభినందించారు. కార్యక్రమంలో వడ్లమూడి, గుంటూరు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ జె. మోహనరావు, వై.వెంకటేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ ప్రభంజనం



విద్యార్థులతో అన్నా నందకిశోర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు విద్యాసంస్థల చైర్మన్ అన్నా నందకిశోర్ తెలిపారు. శనివారం కొత్తపేటలోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత 20 ఏళ్లుగా ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల రాష్ట్రస్థాయిలో టాప్ మార్కులతో పాటు అత్యధిక ఉత్తీర్ణతతో విజయభేరి మోగించిందని తెలిపారు. వ్యక్తిగత శ్రద్ధ, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికాబద్ధమైన బోధనతో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని వివరించారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీ విభాగంలో 500 మార్కులకు గానూ జి. వంశీ ప్రియ 491, సీహెచ్. తన్మయి 491, ఎస్. యోషిత 490, పి. కృష్ణచైతన్య 490, వి. యుక్త యువరాణి 489, ఎంఎల్‌వీఎన్ యశస్విని 489, వై. తన్వీశ్రీ 488, ఎస్. మేఘన 488, సీఈసీ విభాగంలో కె. సర్వంత్ 458 మార్కులు సాధించారని తెలిపారు. సీనియర్ ఎంఈసీ విభాగంలో ఆర్. యెమిత మహి 979, ఎస్వీ కౌశిక్ సాయి 979, వీజే సాయి శ్రీయ 975, కె. వైసిల్య 972, సీఈసీలో పి. సందీప్ కుమార్ 952 మార్కులతో అగ్రస్థానంలో నిలిచినట్లు వివరించారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి శ్రీమేధ చైర్మన్ అన్నా నందకిశోర్, కరస్పాండెంట్ అన్నా శ్రీలక్ష్మి అభినందనలు తెలియజేశారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీ చైతన్య విజయ దుందుభి



విద్యార్థులతో ఈమని దుర్గాప్రసాద్, డీన్లు, ప్రిన్సిపాల్స్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల విద్యార్థులు విజయ దుందుభి మోగించినట్లు విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తెలిపారు. గుంటూరులోని లక్ష్మీపురం శ్రీచైతన్య క్యాంపస్‌లో జరిగిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎం. వినూత్న అత్యధికంగా (467) మార్కులు సాధించగా, షేక్ బుష్రా అంజుమ్ (466), షేక్ గౌస్ ఆజామ్ (466), కె. శ్రావ్య (466), కె. శ్రీనిధి (466), పి. సౌమ్య (466), జి. పూర్ణిమ (466) మార్కులు సాధించినట్ల చెప్పారు. ఎంపీసీ విభాగంలో 465 మార్కులకు పైగా 37 మంది, 464కు పైగా సాధించిన విద్యార్థులు 70 మంది, 460కి పైగా సాధించిన వారు 838 మంది, 450కి పైగా సాధించిన వారు 2,357 మంది, 400 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు 5,219 మంది ఉన్నట్లు వివరించారు. బైపీసీలో ఏ.రమ్య(435), ఏ. గాయత్రీదేవి (435), ఆర్. గీతిక (435), టి. లీలా భవాని (435), వై. సాయి వాసంతి (435), షేక్ నఫీసా (435), ఎం. రత్నశ్రీ (435), ఆర్. తేజస్వి (435) మార్కులు సాధించారని చెప్పారు. బైపీసీ విభాగంలో 430కి పైగా సాధించిన విద్యార్థులు 154 మంది ఉండగా, 420కి పైగా సాధించిన వారు 222 మంది, 400కు పైగా 557 మంది సాధించారని వివరించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో టి. శరణ్య (991), ఆర్. చంద్రశేఖర్ (990), ఎం. బాలాజీ (989), కె. ప్రేరణ (989), కె. ఉషారాణి (988), ఎండీ రమీలా సుల్తానా (9870, బి. శ్రీవిద్య (987) మార్కులు సాధించినట్లు తెలిపారు. 980కి పైగా మార్కులతో 471 మంది, 970కి పైగా మార్కులతో 815 మంది, 950కి పైగా మార్కులతో 1,752 మంది, 900కు పైగా మార్కులు పొందిన వారు 3,915 మంది ఉన్నారని తెలిపారు. గుంటూరులోని విద్యాసంస్థలన్నింటిలో శ్రీచైతన్య అగ్రస్థానంలో నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీన్స్ కిశోర్, చంద్రశేఖర్, సురేష్‌కృష్ణ, అసోసియేట్ డీన్ హరిబాబు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అజరామర జ్ఞాపకం

నాయనమ్మ



కీ॥శే॥ మోదుగుల సుబ్బమ్మ గారి
అనురక్తితో

భార్య



కీ॥శే॥ మోదుగుల ఆదిలక్ష్మి గారి
సహచర్యంలో

అమ్మ - నాన్న



కీ॥శే॥ మోదుగుల రామిరెడ్డి - కోటమ్మ గార్ల
ఆశీస్సులతో

అక్క - చెల్లెలు




వజ్రాల రత్తమ్మ - అంగిరెడ్డి తిరుపతమ్మ గార్ల
అనురాగంతో

అత్త - మామ



కీ॥శే॥ దేవగిరి వెంకటసుబ్బారెడ్డి - కోటమ్మ గార్ల
అభిమానంతో



జననం
09-10-1937

మరణం
06-04-2025

కీ॥శే॥ మోదుగుల పాపిరెడ్డి గారు MA, LLB

ప్రముఖ సోషలిస్టు నాయకులు, న్యాయవాది

" బృహత్తర బాధ్యతతో భూమ్మీద కన్ను విప్పారు
మహత్తర శక్తితో కర్తవ్యం నెరవేర్చి కన్నుమూశారు
మీ జీవితం అపురూపం. మీ జ్ఞాపకం అజరామరం "

ఇట్లు :

మోదుగుల వాసుదేవరెడ్డి, కుమారుడు
మోదుగుల ఉదయకుమారి, కోడలు

మనుమలు - మనుమరాలు
వలసారెడ్డి యజ్ఞేశ్ రెడ్డి - అఖిలాండేశ్వరి
మోదుగుల కార్తిక్ రెడ్డి

మోదుగుల వేణుగోపాలరెడ్డి, కుమారుడు
మోదుగుల మాధవీ కృష్ణ, కోడలు

మనుమలు
మోదుగుల సాకేత్ రామిరెడ్డి
మోదుగుల ప్రణవ సుబ్బారెడ్డి

ఆళ్ల దాక్షాయణి, కుమార్తె
ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, అల్లుడు

మనుమలు - మనుమరాలు
ఆళ్ల శరణ్ - శ్రావ్య
ఆళ్ల ఇషాన్

మహా శాంతి యజ్ఞం

ది. 14-04-2025 సోమవారం ఉదయం గం॥ 9.00 లకు వారి ఆత్మ శాంతికై ఆర్య సమాజం, గుంటూరు వారిచే మహాశాంతి యజ్ఞం తలపెట్టినాము. తదుపరి భోజన కార్యక్రమము జరుగును.

కార్యస్థలము : "శ్రీరామధామం"

తనుబుద్ధిబసివిరెడ్డినగర్, రెడ్డిపాలెం, మహాత్మ గాంధి ఇన్నర్ రింగ్ రోడ్డు, గుంటూరు.

క్లుప్తంగా

నృత్యకళాకారులకు గిన్నిస్ బుక్‌లో చోటు



పెద్దఆవుటపల్లి(గన్నవరం): ఉంగుటూరు మండలం పెద్దఆవుటపల్లికి చెందిన శ్రీవిజయ లలిత కూచిపూడి నృత్య అకాడమీ నృత్య కళాకారులు 30 మంది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారని నాట్యాచారిని జి.వనజ చంద్రశేఖర్ తెలిపారు. ఆమె శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2023 డిసెంబర్ 24న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో భరత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 7,209 మంది కళాకారులతో కూచిపూడి కళావైభవం మహా బృంద నాట్య ప్రదర్శన జరిగిందని పేర్కొన్నారు. ఈ బృందంలో తమ అకాడమీ విద్యార్థులు 30 మంది భాగస్వాములయ్యారని తెలిపారు. ఆ నాట్య ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు ఎక్కిందని పేర్కొన్నారు. నాట్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులందరికీ గిన్నిస్ బుక్ నుంచి సర్టిఫికెట్లు అందాయని వివరించారు.

కొనసాగుతున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 12వ రాష్ట్ర క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు శనివారం కూడా కొనసాగాయి. మహిళల విభాగంలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ స్థాయిలో ఈ పోటీలు జరి గాయి. మాస్టర్స్ మహిళా విభాగం పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన జగపతి తిరుపతమ్మ మూడు విభాగాల్లో బంగారు పతకాలు సాధించి స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ది చాంపియన్‌గా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ సభ్యుడు గుత్తా శివరామ కృష్ణ(చంటి), కోచ్ ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యుడి సేవలో డీజీపీ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా సతీ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ మర్యాదలు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు, వేదపండితులు బాలకృష్ణ శర్మ, మణిదీప్ శర్మ, విరూప్ శర్మ వేద ఆశీర్వచనాలు అందజేశారు. కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు, అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసుల్లో రూ.8 కోట్ల జరిమానా

విజయవాడస్పోర్ట్స్: గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తులకు భారీగా జరిమానా విధించినట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ సాంబశివరావు శనివారం తెలిపారు. 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు 5,317 కేసులను నమోదు చేసి రూ.8.14 కోట్లు జరిమానా విధించామని పేర్కొన్నారు. జిల్లాలోని 30,764 సర్వీసులను తనిఖీ చేశామని, డైరెక్ట్ ట్యాపింగ్‌కు పాల్పడిన 499 మంది, ఫిల్పరేజ్‌కు పాల్పడిన 227 మంది, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన 569 మంది, అధిక లోడుకు పాల్పడిన 3,652 మంది, బ్యాక్ బిల్లింగ్‌కు పాల్పడిన 370 మందిపై కేసులు నమోదు చేశామని వివరించారు. ఇళ్లతో పాటు పరిశ్రమలు, వ్యాపార సముదాయాలను తమ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి అపరాధరుసుం వసూలు చేసినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

కృష్ణాజిల్లాలో..

విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కృష్ణాజిల్లాలో 10,359 కేసులను నమోదు చేసి రూ.15.781 కోట్లు జరిమానా విధించారు. వీటిల్లో అధిక లోడు 9,736, బ్యాంక్‌బిల్లింగ్ 185, మాల్‌ప్రాక్టీస్ 271, తెఫ్ట్ ఆఫ్ ఎనర్జీ(డీటీ) 100, తెఫ్ట్ ఆఫ్ ఎనర్జీ (పీఓఈ) 67 కేసులు ఉన్నాయి.

మూల్యాంకనం కంప్యూటరీకరణ



మచిలీపట్నంరూరల్: బీఈడీ మొదటి సంవత్సరం మూల్యాంకనాన్ని కంప్యూటరీకరణ చేస్తున్నట్లు కృష్ణా వర్సిటీ వీసీ కె.రాంజీ శనివారం తెలిపారు. మూల్యాంకనం ప్రక్రియను ఆయన పరిశీలించారు.

సమ్మర్.. బీ కేర్‌ఫుల్ !

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- కొద్దిపాటి జాగ్రత్తలు అవసరం
- వడదెబ్బతో ప్రాణాలు పోయే ప్రమాదం





గుంటూరు మెడికల్: సాధారణంగా మేలో ఎండలు విపరీతంగా ఉంటాయి. పర్యావరణ విధ్వంసంతో వాతావరణంలో పలు మార్పులు వచ్చాయి. పచ్చని చెట్లు తగ్గిపోయి భూగోళం వేడెక్కిపోవడంతో ఏప్రిల్‌లోనే ఎండలు మండిపోతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రతలకంటే ఎక్కువగా నమోదవుతున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు దీనికి అద్దం పడుతోంది. ఈనేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ ముందస్తు సూచనలు విడుదల చేసింది. వేసవిలో కొద్దిపాటి జాగ్రత్తలు పాటించకపోతే వడదెబ్బ తగిలి ప్రాణాలు పోయే ప్రమాదముంది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఎండలు నమోదయ్యే రెంటచింతల ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఉండటంతో వడదెబ్బ మరణాలు సంభవించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొద్దిపాటి సలహాలు, సూచనలు పాటించి వడదెబ్బ నుంచి ప్రాణాలు కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బ మరణాల నివారణ కోసం అవగాహన కల్పించేందుకు 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వడదెబ్బ తగిలేది ఇలా..

మానవ శరీరంలో ఐదు లీటర్ల మేరకు నీరు ఉంటుంది. అన్ని జీవ క్రియలకు ఇది అత్యవసరం. శరీరంలో ఉష్ణోగ్రత 37 డిగ్రీలు (98.6 ఫారెన్‌హీట్) ఉంటుంది. బయటి వాతావరణంలో ఉష్ణోగ్రత 37 డిగ్రీలు దాటినప్పుడు మన శరీరం ఎండ ప్రభావానికి లోనవుతుంది. అప్పుడు ఉక్కపోతగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఆ సమయంలో శరీరం చల్లబడేందుకు అసంకలిత ప్రతీకార చర్యగా శరీరంలోని నీరు బయటకు వచ్చి సమతా స్థితిని చేరుకుంటుంది. చెమట బయటకు రాకున్నా శరీరంలోని నీరు స్వేద గ్రంథుల ద్వారా ఆవిరి అవుతూనే ఉంటుంది. దీనిని మనం గుర్తించలేం. ఇలా బయటకు వెళ్లిన నీటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాల్సిందే. ఆలస్యమయ్యే కొద్దీ జీవక్రియలు మందగిస్తాయి. ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది.

లక్షణాలు

తలనొప్పి, తలతిరగటం, శరీరంలో నీరు అంతా పోతుంది. ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం కలిగి ఉండటం, మత్తు నిద్ర, కలవరింతలు, జ్వరం 106 డిగ్రీలు దాటగానే ఫిట్స్ వస్తాయి. మనిషి దాని ద్వారా పాక్షిక లేదా పూర్తి అపస్మారకస్థితిలోకి వెళ్తాడు.బీపీ పూర్తిగా తగ్గిపోతుంది. బ్రెయిన్, కిడ్నీ ఫెయిల్ అవుతాయి. మూత్రం స్తంభించి ప్రాణాలు పోతాయి.

వడదెబ్బ తగలకుండా ఉండాలంటే...

- సాధ్యమైనంత వరకు మిట్ట మధ్యాహ్నం ఎండలో తిరుగకుండా జాగ్రత్త వహించాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్లలోనే ఉండటం ఉత్తమం.
- తప్పని సరిగా బయటకు వెళ్లవలసిన పరిస్థితుల్లో ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన పళ్ల రసాలు , చల్లని నిమ్మరసం, కొబ్బరి నీరు, మంచినీరు తాగాలి.
- వేసవి కాలంలో తెల్లని దుస్తులు ధరించాలి. బాగా వదులుగా ఉండే కాటన్ వస్త్రాలు ధరిస్తే మంచిది.
- నల్లని వస్త్రాలు ధరించకూడదు.
- ఇంటి గదుల్లో ఉష్ణోగ్రతను తగ్గించడానికి కిటికీలకు, తలుపులకు తెరలను వాడి, వేడిని తగ్గించవచ్చు. ఫ్యాన్లు, ఎయిర్‌కూలర్లు, ఎయిర్ కండీషనర్లు వాడాలి.
- శీతలంగా ఉన్న ప్రదేశాలలో ఉండేందుకు ప్రయత్నించాలి.
- వేడిగా ఉన్న రోజులలో తప్పని సరిగా గొడుగు, నెత్తికి టోపీ వాడాలి.
- శరీరం నుంచి చెమట రూపంలో నీరు ఎక్కువగా బయటకు పోతుంది. కాబట్టి సాధ్యమైనంత మేరకు మంచినీరు ఎక్కువగా తాగాలి. కనీసం ఐదు లీటర్లు తాగితే మంచిది.
- ఎండలో పొలం పనులకు వెళ్లకూడదు. ఒక వేళ అవసరమైతే ఉదయం, సాయంత్రం వేళల్లో చేయాలి.

తక్షణం వైద్య సహాయం అందించాలి



వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి చేర్చాలి. శరీరంపై దుస్తులను తొలగించి చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవటం చేయాలి. ఐస్ ముక్కలను గుడ్డతో ఉంచి శరీరం అంతా అద్దితే చాలా మంచిది. శరీరం అంతా చల్లని గాలి తగిలేలా చూడాలి. బాధితుడితో చల్లని నీరు లేదా ఉప్పు, ఇతర లవణాలు కలిపిన నీటిని తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. అయితే, ఇవన్నీ బాధితునికి డాక్టర్‌కి చూపించేలోగా చేయవలసిన చర్యలు. స్పృహ కోల్పోతే మాత్రం సమయం వృథా చేయకుండా వైద్య సహాయం అందే ఏర్పాటు చేయాలి.

–డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవర్తి, సీనియర్ ఫిజీషియన్, గుంటూరు

ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాట్లు



ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను, సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాం.. గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలు ఎండ ప్రభావానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశాం . వడదెబ్బ బాధితులకు వైద్యం అందించేందుకు ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, యాంటి డయేరియల్ మందులు అందుబాటులో ఉంచాం. ప్రతి పీహెచ్‌సీ, అర్బన్ పీహెచ్‌సీలో రెండు పడకలు ప్రత్యేకంగా బాధితుల కోసం ఏర్పాటు చేయించాం.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, గుంటూరు.

భారీగా గంజాయి పట్టివేత



చిలకలపూడిలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ నబీ

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్న ఐదుగురిని చిలకలపూడి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చిలకలపూడి సీఐ ఎస్‌కే నబీ శనివారం విలేఖరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం ఆనంద్ పేటకు చెందిన ఉదయ్‌కుమార్ హైదరాబాద్‌లో ఉంటూ మూడు రోజుల క్రితం మచిలీపట్నం వచ్చాడు. ఉదయ్‌కుమార్, బుట్టాయిపేటకు చెందిన షేక్ రియాజ్, బందరు మండలం నవీన్‌మిట్టల్‌కాలనీకి చెందిన గోపీ, ముస్తాఖాన్‌పేటకు చెందిన బలగం నాగరాజు, కాగి జస్వంత్‌లు శనివారం ఉదయం మాచవరం మెట్టు సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న చిలకలపూడి స్టేషన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నాడు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం తమదైన శైలిలో విచారణ చేయగా ఐదుగురు గంజాయి అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు 25.62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాగరాజు ద్విచక్ర వాహనంతో పాటు ఉదయ్‌కుమార్ కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వీటితో పాటు వారి నుంచి 6 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు మరింత దర్యాప్తు చేస్తున్నామన్నారు. గంజాయి కేసులో లోతైన దర్యాప్తు చేపట్టి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బందరు డీఎస్పీ రాజా ఆధ్వర్యంలో గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు ప్రత్యేక టీమ్‌లు పనిచేస్తున్నట్లు చెప్పారు. గంజాయి విక్రయాలకు సంబంధించి ప్రజల వద్ద ఎటువంటి సమాచారం ఉన్నా నేరుగా తమకు తెలియజేసి గంజాయి నిర్మూలనకు సహకరించాలని కోరారు.

సూర్యలంకకు రోడ్డు పోటు

- వెనక్కి తగ్గిన మున్సిపాలిటీ
- పర్యాటక కేంద్రానికి తగ్గనున్న ప్రాధాన్యం



పిడుగురాళ్ల-వాడరేవు మార్గంలో నిర్మిస్తున్న వంతెన

బాపట్ల : కార్తిక మాసంలో పుణ్య స్నానాలు ఆచరించాలి అంటే ముందుగా గుర్తుకు వచ్చేది సూర్యలంక. రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రజలు ఇక్కడకు వచ్చి స్నానాలు ఆచరిస్తుంటారు. పర్యాటకులు వచ్చి సేద తీరేందుకు సరైన వసతులు లేక అంతగా అభివృద్ధి చెందలేదు. ఇటీవల సూర్యలంక అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వం విధానాల కారణంగా భవిష్యత్‌లో సూర్యలంక మరింత నిరాదరణకు గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

'రింగ్' తిరిగేనా?

వాడరేవు నుంచి సూర్యలంకకు రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ లభించడం లేదు.

చేతులెత్తేసిన మున్సిపాలిటీ

సూర్యలంక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే మున్సిపాలిటీ పరిధిలోకి వస్తేనే సాధ్యమని వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి సూర్యలంకను మున్సిపాల్టీలో విలీనం చేశారు. దీంతో మున్సిపాల్టీ ప్రత్యేక పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టి సూర్యలంక తీరానికి శోభ తీసుకువచ్చారు. తాజాగా కూటమి ప్రభుత్వం సూర్యలంకను మున్సిపాల్టీ జాబితా నుంచి తొలగించింది. దీంతో ఆ ప్రాంతం గురించి పట్టించుకునేవారే కరువయ్యారు.

అమలు కాని హామీలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని దశాబ్దాలుగా సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తామని పదే పదే ప్రకటిస్తున్నా పనులు మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడట్లేదు. 2009–14 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి చిరంజీవి స్వయంగా సూర్యలంక వచ్చి హామీలు గుప్పించారు. రూ.100 కోట్ల వ్యయంతో శాండీ బీచ్‌ను పర్యాటక రంగానికి ప్రత్యేక బ్రాండ్‌గా అభివృద్ధి చేస్తామని అప్పటి కేంద్ర మంత్రి, బాపట్ల ఎంపీ పనబాక లక్ష్మీ ఇచ్చిన హామీలు కూడా అమలుకు నోచుకోలేదు.

కూటమి ప్రభుత్వం వచ్చాక ఇలా..

హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి నేరుగా సూర్యలంక బీచ్‌కి వచ్చే పర్యాటకులతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందింది. పిడుగురాళ్ల నుంచి వాడరేవుకు రోడ్డు నిర్మాణంతో పర్యాటకులంతా వాడరేవుకు తరలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. కనీసం వాడరేవు నుంచి రింగ్ రోడ్డును సూర్యలంక వరకు నిర్మిస్తే బాగుంటుందని అందరు ప్రతిపాదించారు. దీనిపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఇటీవల వాడరేవుకు వచ్చినప్పుడు కూడా స్పష్టమైన హామీ ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వ పథకం స్వదేశీ దర్శన్ 2.0కి అనుసంధానంగా రూ.97 కోట్ల వ్యయంతో సూర్యలంక తీరాన్ని అభివృద్ధి చేసేస్తామని చెబుతున్నప్పటికి స్పష్టమైన ప్రణాళికలు లేకపోవటం బాధాకరం.

అరకొర వసతులు

అరకొర వసతుల కారణంగా సూర్యలంక అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఒకపక్క ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, మరో పక్క అటవీ భూముల కారణంగా బీచ్ నుండి మూడు కిలోమీటర్ల వరకు పర్యాటకులకు ఎక్కడా నిలువ నీడలేకుండా పోయింది. తీరానికి వచ్చిన వారు కూడా స్నానం చేసిన వెంటనే వెళ్లిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సూర్యలంక వచ్చేందుకు పర్యాటకులు అంతా ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సూర్యలంక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అందరూ కోరుతున్నారు.

శాపంగా మారనున్న బైపాస్ నిర్మాణం



చురుగ్గా సాగుతున్న రోడ్డు పనులు

పర్యాటక కేంద్రమైన సూర్యలంక తీరానికి పిడుగురాళ్ల బైపాస్ రోడ్డు నిర్మాణం శాపంగా మారింది. పిడుగురాళ్ల నుంచి వాడరేవు వరకు రూ.1851 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంతోపాటు హైదరాబాద్ నుంచి వచ్చే పర్యాటకులు నేరుగా వాడరేవు వెళ్లే అవకాశం ఏర్పడుతుంది. ప్రయాణ భారం తగ్గుతుంది. దీంతో పర్యాటకులు వాడరేవు వైపు ఆసక్తి చూపే అవకాశం ఉంది. సూర్యలంక వచ్చే పర్యాటకుల సంఖ్య తగ్గనున్నది.

వైభవంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులు, సేవకులు



ప్రత్యేక వాహనంపై శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ శనివారం వైభవంగా సాగింది. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభం కాగా విశేష సంఖ్యలో అమ్మవారి భక్తులు, ఉభయదాతలు, సేవా సిబ్బంది కుటుంబ సమేతంగా హాజరయ్యారు. తెల్లవారుజామున 5.55 గంటలకు కామధేను అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీ గంగా పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

8 కిలో మీటర్ల మేర ప్రదక్షిణ..

ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ ఉత్సవ మూర్తులకు పూజాది కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, డప్పు కళాకారుల విన్యాసాలు, కోలాట నృత్యాల మధ్య గిరి ప్రదక్షిణ కుమ్మరి పాలెం, విద్యాధరపురం, సితార, కబేళా, పాలప్రాజెక్టు, కేఎల్‌రావునగర్, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి మీదుగా ఆలయానికి చేరుకుంది. సుమారు 8 కిలో మీటర్ల మేర సాగిన గిరి ప్రదక్షిణలో పాల్గొనడం ద్వారా భక్తుల మనోభీష్టి నెరవేరుతుందని, అమ్మవారి కరుణా కటాక్షాలతో కుటుంబం సుఖ సంతోషాలతో విరసిల్లుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. భక్తులు పసుపు నీళ్లతో గిరి ప్రదక్షిణ మార్గాన్ని శుద్ధి చేసి ఆది దంపతులకు భక్తితో పూజా ద్రవ్యాలను సమర్పించారు. గిరి ప్రదక్షిణ మార్గాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. గిరి ప్రదక్షిణ పూర్తయిన అనంతరం భక్తులు కొండపైకి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు.

దుర్గమ్మకు పలువురు భక్తుల విరాళాలు



దాతకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శనివారం పలువురు భక్తులు విరాళాలను అందజేశారు. అమ్మవారి సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకం, బంగారు గోపురం పనులకు భక్తులు విరాళాలను అందించారు. అమ్మవారి నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన ఎం.శ్రీనివాసరావు కుటుంబం రూ.1,01,116, హైదరాబాద్‌కు చెందిన కె.విష్ణువర్ధనదేవి రూ.లక్ష హైదరాబాద్‌కు చెందిన మరో భక్తుడు వి.శ్రీనివాస్ రూ. 1,01,116 విరాళాన్ని అందించారు. బంగారు తాపడం పనులకు విజయవాడకు చెందిన డి.రామాంజనేయులు రూ.1,51,116, విశాఖపట్నంకు చెందిన కె.బాలకృష్ణారావు కుటుంబం రూ.లక్ష అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలతో సత్కరించారు.

నయనానందకరం.. శ్రీవారి కల్యాణం



కల్యాణ వేడుకలో మంగళ సూత్రాలను చూపుతున్న అర్చకుడు



కల్యాణ వేడుకను తిలకించేందుకు హాజరైన భక్తులు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): పండు వెన్నెల.. మల్లె పందిరి.. రంగురంగుల విద్యుత్ దీపాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై వాల్మీ కోద్భవ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం శనివారం రాత్రి నయనానందకరంగా జరిగింది. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ వేడుకను నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులతో కొండపైన ఉన్న ఆలయం నుంచి గ్రామంలో ఊరేగించి ఎదురుకోలోత్సవం జరిపించారు. అనంతరం కొండ కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపంలోకి విగ్రహాలను ప్రతి ష్ఠించి ఆలయ ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణ మాచార్యులు, పరాంకుశం వాసుదేవాచార్యులు పర్యవేక్షణలో కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ స్వామికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ భరద్వాజ్, పాలకవర్గ సభ్యులు, పలువురు దంపతులు పీటలపై కూర్చున్నారు. స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వాసుదేవాచార్యులు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఐపీఎస్ అధికారి మనీషారెడ్డి ఆధ్వర్యంలో నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

సింహ వాహనంపై ఆది దంపతులు





ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చైత్రమాస బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన శనివారం శ్రీగంగ, పార్వతి (దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్లకు సింహ వాహన సేవ జరిగింది. సాయంత్రం ఐదు గంటలకు ఆలయ ప్రాంగణంలోని మల్లేశ్వర మహా మండపం నుంచి నగరోత్సవ సేవ ప్రారంభమైంది. సింహ వాహనంపై అధిష్టించిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ అర్చకులు పూజలు చేశారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ వాహన సేవ కనకదుర్గనగర్, రథం సెంటర్, బ్రాహ్మణవీధి, కొత్తపేట, సామారంగం చౌక్, మెయిన్ రోడ్డు మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. సింహ వాహనంపై దర్శనమిచ్చిన ఆదిదంపతులకు భక్తులు పూజాసామగ్రి సమర్పించారు. ఉదయం మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద మూల మంత్ర హవనం, సదస్యం, వేద స్వస్తి జరిగాయి.